క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీమకుర్తి: మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు చీమకుర్తి ఏడీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీమకుర్తి పట్టణంతో పాటు నాయుడుపాలెం, కూనంనేనివారిపాలెం, పరిశ్రమల ఏరియా, గోనుగుంట, రామచంద్రాపురం, పల్లామల్లి, బండ్లమూడి, గాడిపర్తివారిపాలెం పరిసరాల్లోని పలు గ్రామాలకు, వ్యవసాయ రంగానికి కరెంటు సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు.

పదోన్నతి సౌకర్యం కల్పించాలి

ఒంగోలు: ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పదోన్నతి సౌకర్యం కల్పించాలని ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవో నెంబర్ 50 ప్రకారం 206 మంది ప్రభుత్వంలో విలీనమయ్యారని, వీరిలో అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని డీఈఓ డి.సుభద్రకు విజ్ఞప్తి చేశారు.

వేసవి శిక్షణ విద్యార్థులకు చాలా మేలు



వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న శామ్యూల్

నాగులుప్పలపాడు: గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శామ్యూల్ అన్నారు. ఉప్పుగుండూరు శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణలో భాగంగా మంగళవారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు ప్రసాద్, సచివాలయ సిబ్బంది అలేఖ్య ఉన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్ సీపీ నేత మృతి

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ నాయకుడు అంబటి రామిరెడ్డి (52) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక అయ్యప్ప నగర్‌లోని తన స్వగృహంలో ఉన్న సమయంలో తీవ్ర గుండెపోటు వచ్చింది. వెంటనే ఆయన్ను సమీపంలోని వైద్యశాలకు తరలించారు. అప్పటికే రామిరెడ్డి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పల్నాడు జిల్లా శిరిగిరిపాడు మండలం మిట్టమీదిపల్లె గ్రామానికి చెందిన ఆయన యర్రగొండపాలెం పంచాయతీలోని వై.కొత్తపల్లిలో వివాహం చేసుకొని ఇక్కడే స్థిరపడ్డాడు. దాదాపు సంవత్సరం క్రితం ఆయన భార్య మల్లేశ్వరి కిడ్నీ వ్యాధితో బాధపడుతోందని, అందుకు రూ.25 లక్షలు అవసరం ఉంటుందన్న విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన సీఎం ఆమె ఆపరేషన్‌కు రూ.25 లక్షల మేర ఎల్‌వోసీ ఇచ్చారు. ఆపరేషన్‌కు ముందు ఆమె అకస్మికంగా మృతి చెందింది. భార్య మృతి చెంది సంవత్సరం గడవక ముందే ఆయన మృతి చెందడం కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగి పోయారు. ఆయనకు కుమారుడు ఉన్నాడు. రామిరెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తీవ్ర సంతాపం వెలిబుచ్చారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

గుంటి గంగలో ప్రత్యేక పూజలు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శ్రీగుంటి గంగాభవాని అమ్మవారి ఆలయంలో మంగళవారం లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ ప్రాంగణంలో 50 మంది ముత్తైదువులతో 108 సార్లు లలితా సహస్రనామ పారాయణం, దేవీ ఖడ్గమాల పారాయణం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతి రోజు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ కార్తీక్ తెలిపారు. అందులో భాగంగా గురువారం మహా చండీ హోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అవాస్తవాలు పోస్టు చేస్తే చర్యలు తప్పవు

గిద్దలూరు రూరల్: సోషల్ మీడియాలో అవాస్తవాలను పోస్టు చేస్తే అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్థానిక సీఐ వైవీ సోమయ్య హెచ్చరించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు వ్యక్తులు వాట్సాప్‌ల్లో సోషల్ మీడియాల ద్వారా అవాస్తవాలను పోస్టులు చేస్తున్నారని, అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిజనిజాలు తెలియకుండానే వాట్సాప్‌ల్లో వచ్చిన కొన్ని అవాస్తవ కథనాలను వ్యక్తిగత పోస్టులను పోస్టు చేస్తే అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే అవాస్తవ పోస్టులతో చాలా సమస్యలు తలెత్తుతున్నాయని, అలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఎటువంటి పత్రాలు లేని వాహనాలు సీజ్



పట్టుబడిన వాహనాలతో రూరల్ సీఐ టీఎక్స్ అజయ్‌కుమార్, ఎస్‌ఐలు సిబ్బంది



కొత్తపట్నంలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కొత్తపట్నం: ఎటువంటి పత్రాలు లేని వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. మండల కేంద్రమైన కొత్తపట్నం గ్రామంలో రెండో పట్టణ సీఐ జగదీశ్ ఆధ్వర్యంలో మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి రిజిస్ట్రేషన్ లేని పత్రాలను పోలీసులు రొడ్డు పక్కన పెట్టిన ద్విచక్ర వాహనాలను, నడుపుతున్న వివిధ రకాల వాహనాలను ఆపి తనిఖీ చేశారు. 20 ద్విచక్ర వాహనాలను రిజిస్ట్రేషన్ పత్రాల లేని వాటిని, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఒంగోలు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బజారు ఇరుపక్కల, ప్రతి చిన్న బజారులో గాలింపు చర్యలు చేపట్టారు. ఎన్నికలు పూర్తి అయ్యేంత వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, గొడవలు, కొట్లాటలు జరగకుండా ముందుస్తు జాగ్రత్తగా గ్రామాల్లో తీరుగుతున్నామన్నారు. ఎన్నికలు లెక్కింపు అయ్యేంత వరకు గ్రామీణ ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ చేస్తున్నామని సీఐ తెలిపారు. ఎన్నికలు అయిన తరువాత గొడవలు జరుగుతాయనే ముందుస్తుగా అనుమానితులను బైండోవర్ చేయించుకున్నామన్నారు. స్థానిక ఎస్సై బి.సాంబశివరావు, పోలీసులు పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్‌లో 20 మోటర్ బైకులు స్వాధీనం

మద్దిపాడు: మండలం కేంద్రం మద్దిపాడులోని బీసీ కాలనీలో రూరల్ సీఐ టీఎక్స్ అజయ్‌కుమార్ నేతృత్వంలో మద్దిపాడు, నాగులుప్పలపాడు, సంతనూతలపాడు ఎస్‌ఐలు వారి సిబ్బందితో కలిసి తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎన్నికల నియమావళిని అనుసరించి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించి సరైన పత్రాలు లేని 20 మోటర్ సైకిళ్లను సీజ్ చేశారు. సిబ్బంది సహాయంతో మోటర్ బైక్‌లను స్టేషన్‌కు చేర్చారు. సీజ్ చేసిన వాహనాలను ఎంవీఐకి పంపనున్నట్లు మద్దిపాడు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట సంతనూతలపాడు ఎస్‌ఐ దేవకుమార్, నాగులుప్పలపాడు ఎస్‌ఐ బ్రహ్మనాయుడు వారి సిబ్బంది, మద్దిపాడు పోలీసులు పాల్గొన్నారు.

మారణాయుధాలు ఉంటే చర్యలు

- సోషల్ మీడియాలో రెచ్చగొట్టే సందేశాలకు అడ్మినే బాధ్యుడు
- మీడియా సమావేశంలో సీఐ రామకోటయ్య హెచ్చరిక



మీడియాతో మాట్లాడుతున్న సీఐ రామకోటయ్య

కంభం: మారణాయుధాలు చట్టవ్యతిరేకంగా కలిగి ఉంటే నేరమని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ జె.రామకోటయ్య హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎస్సై పులి రాజేష్‌తో కలిసి సర్కిల్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని, పోలీసులు తనిఖీలు నిర్వహించినప్పుడు వ్యవసాయపరంగా, ఇండస్ట్రియల్ పరంగా కాకుండా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు వినియోగించే మారణాయుధాలు దొరికితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరైన ధృవీకరణ పత్రాలు లేకుండా ఉన్న వాహనాలు పోలీసులు స్వాధీనం చేసుకుంటామని, సదరు వాహన యజమానులు వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లవచ్చని, లేని పక్షంలో రవాణ శాఖ అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో త్వరలో కౌంటింగ్ జరగనుండటంతో రాజకీయ నాయకులు సంయమనం పాటించి చట్టానికి లోబడి ప్రశాంతంగా ఉండాలన్నారు. పెట్రోల్ బంకుల్లో బాటిల్స్, క్యాన్‌ల్లో విడిగా పెట్రోలు పోయకూడదని, దుకాణాల్లో విడిగా పెట్రోల్ విక్రయించరాదని సూచించారు. పెట్రోల్ బంకు యజమానులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామని, నిబంధనలు ఉల్లంఘించి విడిగా పెట్రోల్, డీజిల్ విక్రయాలు చేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారని, వర్గాల మధ్య, పార్టీల మధ్య రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదని, ఏవైనా గ్రూపుల్లో అటువంటి పోస్టులు వస్తే వాటి బాధ్యత ఆ గ్రూపు అడ్మిన్‌లదేనని వాట్సప్ గ్రూప్ అడ్మిన్ అటువంటి పోస్టులు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ ముగిసిన అనంతరం విజయోత్సవ ర్యాలీలు, రంగులు చల్లుకోవడం, బాణసంచా కాల్చడం వంటివి నిషేధమని, రాజకీయ పార్టీల నాయకులు గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికల కమిషన్, ఎస్పీ ఆదేశాల మేరకు చట్టవ్యతిరేక కార్యక్రమాలకు ఎవరు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భక్తి శ్రద్ధలతో నరసింహస్వామి జయంతి



ప్రత్యేక అలంకారంలో లక్ష్మీ నరసింహస్వామి



పూజల్లో పాల్గొన్న చైర్మన్ బాలమురళీకృష్ణ దంపతులు

మార్కాపురం రూరల్: మార్కాపురం పట్టణ శివార్లలోని కపిలగిరిపై ఉన్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంతిని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి సహస్ర నామార్చన, పంచామృతాభిషేకం, చందనోత్సవం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు కల్యాణోత్సవం జరిగింది. ఆలయ అర్చకులు శ్రీరంగం రామానుజాచార్యుల దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ దంపతులు, కమిటీ ప్రతినిధి బొగ్గరపు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలి

పుల్లలచెరువు: ఇటీవల మండలంలో చెదురు మొదురు వర్షాలు పడటంతో పొలాలు కొంత మేరకు పదునయ్యాయి. కొందరు రైతులు పత్తి పంట సాగు చేసే అవకాశాలు ఉన్నాయి. తొలకరి పలకరించడంతో ఖరీఫ్‌లో రైతులను ఆకట్టుకునేందుకు పలు విత్తనాల కంపెనీలు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నాయి. అన్నదాత జాగ్రత్తగా లేకుంటే నకిలీ విత్తనాలతో నష్టపోయే ప్రమాదం ఉంది. తొలకరి పలకరించడంతో పాటు ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో అసలు విత్తనాలతో పాటు నకిలీ విత్తనాలు కూడా రైతులకు అంటగట్టే ప్రమాదం ఉంది. గ్రామాల్లోని కొందరు నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. గ్రామాల్లో ప్రచార రథాలు, గోడలపై పోస్టర్లు వేయడంతో పాటు తమ కంపెనీ విత్తనాలు కొనండి, అన్నింటికంటే నాణ్యమైనవని, అధిక దిగుబడి వస్తుందని, గతేడాది గ్రామాల్లో ఫలానా రైతులు తమ కంపెనీల విత్తనాలు వాడారనే తప్పుడు ప్రచారాలు చేసి రైతులను నమ్మిస్తున్నారు. దీంతో అభం శుభం తెలియని రైతులు వారి మాటలు నమ్మి మోసపోయే పరిస్థితి నెలకొంది. మండలంలోని చాలా గ్రామాల్లో చాలా వరకు పత్తిని ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్నారు. గతంలో మండలంలోని కొన్ని గ్రామాల్లో ఎక్కడో ఇతర ప్రాంతాల్లో విత్తనాలు కొని ఎటువంటి ప్రతాలు లేక పోవడంతో అవి నకిలీవని తేలినా కూడా వారికి నష్ట పరిహారం అందిన దాఖలాలు లేవు. అధికారులు నకిలీ విత్తనాలపై కొరడా ఝళిపించాలని అన్నదాతలు కోరుతున్నారు.

పత్తి సాగుపై ఆసక్తి

గతేడాది పత్తి రైతులు ప్రతికూల వాతావరణంతో పాటు తెగుళ్లు, గిట్టుబాటు ధరలు లేక నష్టపోవడంతో ఈ ఏడాది కొంత మేరకు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉందని, ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని రైతులను అధికారులు కోరుతున్నారు. ఈ ఏడాది మండలంలో 2 వేల హెక్టార్లలో పంట సాగు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రైతులు ముందుగా పొలాలను శుభ్రం చేస్తున్నారు. ఏ రకం పత్తి విత్తనం కొనాలా అని రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం బీటీ పత్తి విత్తనాల్లో రకాలు వస్తున్నాయని, తగిన జాగ్రత్తలు తీసుకుని విత్తనాలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

పారదర్శకంగా పంట నష్టం జాబితా

కొనకనమిట్ల: మండలంలో 2023–24కు సంబంధించి కరువు మండలంగా కొనకనమిట్ల మండలాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో గ్రామ వ్యవసాయశాఖ సహాయకులు పంట నష్టం జాబితాను పారదర్శకంగా చేపట్టాలని స్థానిక ఏఓ ప్రసన్న రంగలక్ష్మి సూచించారు. స్థానిక ఏఓ కార్యాలయంలో అన్నీ గ్రామాల వ్యవసాయ సహాయకులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ 2023 సంవత్సరం రబీలో సాగు చేసిన పంటల వివరాలను సేకరించి సంబంధిత నివేదికను జిల్లా అధికారులకు పంపుతామన్నారు. అందుకు సంబంధించిన పంటల వివరాలు, రైతుల జాబితా వివరాలు, ఈ క్రాప్ చేసిన పంటల వివరాలు నమోదు చేయాలన్నారు. రబీలో సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ చేశామని వాటికే నష్టపరిహారం వర్తిస్తుందని ఏఓ తెలిపారు. మండలంలో రబీలో సాగు చేసిన మినుము, అలసంద, ఉలవలు, పప్పు శనగ పంటలు అధికంగా లోటు వర్షపాతం వలన దెబ్బతిన్నాయన్నారు. ఈ పంట జాబితాలో ఉన్న రైతుల ఆధార్, బ్యాంక్ అకౌంటు నంబర్లు సేకరించాలని వ్యవసాయ సహాయకులకు సూచించారు. ఈనెల 28వ తేదీలోగా నష్టం అంచనా వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని ఏఓ ప్రసన్న రంగలక్ష్మి తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎంలు

బేస్తవారిపేట: విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ శర్మ అన్నారు. మంగళవారం అధ్యాపకులతో కలిసి ప్రచారం చేశారు. బేస్తవారిపేట జెడ్పీ బాలుర హైస్కూల్‌ను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తూ జూనియర్ కళాశాలగా మార్చినట్లు పేర్కొన్నారు. ఇంగ్లిష్ మీడియం ఎంపీసీ విభాగంలో 40 సీట్లు, బైపీసీలో 40 సీట్లు మాత్రమే ఉన్నాయన్నారు. అన్నీ వసతులతో బేస్తవారిపేట టౌన్‌లో కళాశాల ఏర్పాటు చేయడంతో మారుమూల ప్రాంత విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులతో కరపత్రాలను ఆవిష్కరించారు.

వృద్ధురాలి హత్య కేసులో బావ, బావమరిదే నిందితులు

కొత్తపట్నం: ఈ నెల 19న కొత్తపట్నంలోని రెడ్డిపాలెం వద్ద హత్యకు గురైన గుడిపల్లి నాగేశ్వరమ్మ హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసి జిల్లా జైలుకు తరలించినట్లు రెండో పట్టణ సీఐ జగదీశ్ మంగళవారం తెలిపారు. రెడ్డిపాలెం గ్రామానికి చెందిన కోడూరి అన్నా దొరై మూడో కుమారుడైన కోడూరి నాగరాజు, అతని బావమరిది గౌరవరపు నాంచారయ్య కలిసి ఆదివారం రాత్రి కల్లు తాగడానికి వచ్చారు. మృతురాలు నాగేశ్వరమ్మను నిద్రలేపి కల్లు తాగి ఒక్కసారిగా ఇద్దరు కలిసి ఆమెపై దాడికి పాల్పడ్డారు. ఆమె చేతికి ఉన్న రోల్డ్‌గోల్డ్ గాజులను బంగారు గాజులుగా భమించి వాటిని తీసుకువెళ్లే ప్రయత్నంలో ఆమె తలకు ఎడమవైపు కొట్టి దిండుతో ఆమె ముఖాన్ని గట్టిగా అదమడంతో ఊపిరిరాడక చనిపోయింది. ఆమె చెవికి ఉన్న రెండు కమ్మలను బలవంతంగా లాక్కొని వెళ్లారు. వీరిద్దరూ కల్లుతాగడం, చెడు వ్యసనాలకు గురై నేర ప్రవృత్తితో జీవనం సాగిస్తున్నట్లు తెలిసింది. విద్యుత్ మోటార్లు, బైకులు దొంగతనాలు చేయడం వంటి వాటికి అలవాటు పడ్డారు. ఆటో నడుపుకుంటూ సామగ్రిని తస్కరించడం పనిగా పెట్టుకున్నారు. ఇటీవల కొత్తపట్నం దొంగల వేప చెట్టు సమీపంలో మూడు టైర్లను దొంగిలించి తీసుకుని వెళ్లినట్లు సమాచారం. డాగ్ స్క్వాడ్ రంగంలో దిగడంతో వారు భయపడి ముందు జాగ్రత్తగా ఒంగోలులోని పోలీసులకు లొంగిపోయారు. దొంగతనానికి గురైన సొత్తు మొత్తాన్ని రికవరీ చేశారు. కోడూరి నాగరాజు, గౌరవరపు నాంచారయ్యలను అరెస్టు చేసి ఒంగోలు జిల్లా జైలుకు తరలించామని రెండో పట్టణ సీఐ జగదీష్ తెలిపారు.

క్రమశిక్షణ చర్యలకు ఆదేశం



కొత్తకోటలో కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ వెంకట స్వామి

నాగులుప్పలపాడు: ఉపాధి పనుల్లో బాధ్యత లేకుండా వ్యవహరించే ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదని డ్వామా ఒంగోలు క్లస్టర్ ఏపీడీ పాలేటి వెంకటస్వామి అన్నారు. నాగులుప్పలపాడు మండల పరిధిలోని కొత్తకోట, తక్కెళ్లపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏపీడీ వెంకటస్వామి తక్కెళ్లపాడు గ్రామంలో జరుగుతున్న 3 పనుల్లో ఒక్క చోట మాత్రమే కూలీలు ఉండి, మిగతా రెండు పనుల్లో ఉదయం 8 గంటలకు కూడా కూలీలు రాకుండా ఉండడాన్ని గుర్తించారు. ఆ గ్రామ ఫీల్డు అసిస్టెంట్, టీఏ లపై క్రమశిక్షణ చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించినట్లు వెంకటస్వామి తెలిపారు. అనంతరం కొత్తకోట గ్రామంలో కూలీలతో మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలందరూ తప్పకుండా ఉదయం 6 గంటలకు ఫీల్డులో ఉండాలని, పని ప్రదేశంలో నీడ కోసం టెంట్‌లు ఏర్పాటులో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీళ్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి కూలీ చేత రూ.300 వేతనం పడేలా పనులు చేయించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో రవి, టీఏలు ఉన్నారు.

కనుల పండువగా చెన్నకేశవ స్వామి కల్యాణం



కల్యాణ క్రతువులో అర్చక స్వాములు

ఒంగోలు మెట్రో: స్థానిక చెన్న కేశవస్వామి పేటలో వేంచేసియున్న శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో చిత్తా నక్షత్రం సందర్భంగా రాత్రి ఏడు గంటలకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి రజనీ కుమారి పర్యవేక్షణలో శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి వారి మాస కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో చక్కగా అలంకరించిన ఉత్సవ మూర్తులను కళ్యాణ వేదికపై తీసుకొచ్చి స్వామి, అమ్మవార్ల కళ్యాణ క్రతువును అర్చక స్వాములు పి. రామనాథా చార్యులు, నాగార్జున దేవ్, శ్రీధర్, కె. రాంబాబు నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బిడ్డకు ఆస్పత్రిలో జనన ధ్రువీకరణ పత్రాన్నివ్వాలి

- డీఎంహెచ్‌ఓ డా.సురేష్ కుమార్

ఒంగోలు టౌన్: ఆస్పత్రిలో జరిగిన జననాలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలను డిశ్చార్జిలోపు అందజేయాలని డీఎంహెచ్‌ఓ డా.సురేష్ కుమార్ ఆదేశించారు. జనన, మరణ రిజిస్ట్రేషన్లపై జిల్లా వైద్యాధికారులు, గణాంక అధికారులకు విజయవాడలో సోమవారం నిర్వహించిన శిక్షణ గురించిన వివరాలను మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జనన, మరణాలను ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో అప్డేట్ చేయాలని కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సూచించినట్లు తెలిపారు. పోర్టల్ గురించి సామాన్యుల్లో అవగాహన కల్పించాలని, వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి జనన ధ్రువీకరణ పత్రం ఆవశ్యకతను వివరించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రజలు వారి కుటుంబంలో జరిగిన జననాలు, మరణాల వివరాలను సకాలంలో సంబంధిత అధికారులకు తెలియజేసి ధ్రువీకరణ పత్రాలు పొందాలని కోరారు.

హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం అందజేత



బాధితులకు పౌష్టికాహారం అందిస్తున్న లక్ష్మీ కోటయ్య మెమోరియల్ సొసైటీ

ఒంగోలు టౌన్: లక్ష్మి కోటయ్య మెమోరియల్ సొసైటీ ద్వారా హెచ్‌ఐవీ బాధితులకు ప్రతినెలా పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు సొసైటీ గౌరవాధ్యక్షుడు డి. ప్రేమ్ కుమార్ తెలిపారు. మంగళవారం నగరంలోని పాత మార్కెట్ సూర్య టవర్స్ వద్ద గల సొసైటీ కార్యాలయంలో 10 మంది బాధితులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారికి ప్రతినెలా పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. మున్ముందు సొసైటీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వివరించారు. గడియపూడి ఎంపీటీసీ పైనం ప్రభాకరరావు, చౌక దుకాణాదారులు సంఘం అధ్యక్షుడు కూరపాటి సుబ్బారావు, సొసైటీ కార్యదర్శి సీహెచ్‌వీ రాఘవ, ఉపాధ్యక్షులు డి. శరణ్య, సభ్యులు నాగరాజు పాల్గొన్నారు.

వేసవి ఉచిత శిక్షణను ఉపయోగించుకోండి



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్య సంజీవ్

మార్కాపురం టౌన్: కోడిరామ్మూర్తి క్రీడా సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో వేసవి ఉచిత నృత్య, నట శిక్షణ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని ప్రముఖ ఆర్థోవైద్యులు వైద్య సంజీవ్ అన్నారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను శిక్షణ శిబిరానికి పంపి వివిధ అంశాలపై ఇస్తున్న శిక్షణలో తమ పిల్లలు పాల్గొనేలా చూడాలన్నారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పిన్నిక నాగేశ్వరరావు, కాళంగి శ్రీనివాసులు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, వేలాది మంది విద్యార్థులు తమ వద్ద శిక్షణ పొందారని, పలువురు ఉద్యోగాలు పొందారన్నారు. శిక్షణ ఉదయం 6.30 నుంచి 8.00 గంటల వరకూ, సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7.00 గంటల వరకూ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికేట్ ఇస్తామన్నారు. బాక్సింగ్ కోచ్ వేణు మాట్లాడుతూ జాతీయ క్రీడాకారులకు విద్య ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ ఉందని తెలిపారు. కాళంగి లక్ష్మీ ప్రియ మాట్లాడుతూ నృత్య శిక్షణకు తమ చిన్నారులను పంపాలని కోరారు. భరతనాట్యం, సంగీతం నేర్పిస్తారన్నారు. వినుకొండ మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, కోచ్ రాంబాబు, ఫుట్‌బాల్ కోచ్ ఉప్పు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కల్యాణ మహోత్సవాలు

యర్రగొండపాలెం: స్థానిక మిల్లంపల్లిలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం నుంచి ప్రారంభం అవుతాయని ఆ దేవస్థానం నిర్వాహకులు తెలిపారు. 22వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణం, ధ్వజారోహణం, రాత్రి 8 గంటలకు భేరిపూజ, దేవతాహ్వానం, రాయబారం, ఎదురుకోల, తెల్లవారు జామున విశాఖ నక్షత్రయుక్త పుష్కరాంశమున రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. 23న ఉదయం సూర్యవాహనం, రాత్రి సింహ వాహనం, 24న ఉదయం చంద్రవాహనం, రాత్రి శేషవాహనం, 25న రాత్రి హనుమంతవాహనం, 26న రాత్రి గరుడ వాహనం, 27న రాత్రి గజ వాహనం, 28న రాత్రి రథోత్సవం, 29న రాత్రి అశ్వ వాహనం, 30న ఉదయం పూర్ణాహుతి, చంక్ర స్నానం, రాత్రి హంసవాహనం, వసంతోత్సవం, ధ్వజారోహణం, గృహ ప్రవేశం కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు.